TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9

# వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 60 | 13-07-2026 సోమవారం | పేజీలు: 08 | వెల: 3/-

## మాలల హక్కుల కోసం.. పదవులైనా వదులుకుంటా



05




# హింసను ప్రేరేపించేలా రేవంత్ వ్యాఖ్యలు

- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు
- హిట్లర్ తనకు ఆదర్శమని గతంలో రేవంత్ చెప్పారని విమర్శ
- ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేక వ్యక్తిగత వ్యాఖ్యలంటూ ఆరోపణ
- నిన్న చేసిన వ్యాఖ్యలపై సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- షాబాద్ ఘటనపై తెలంగాణ సీఎం స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్య
- కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎంకు ఇప్పటికీ సరైన అవగాహన లేదని విమర్శ
- మేడిగడ్డ వద్ద నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- రైతులకు సాగునీరు అందించకుండా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆగ్రహం
- ఎల్లంపల్లి నీటి విషయంలో రాజకీయాలు చేస్తే రాష్ట్రానికి నష్టం తప్పదని హెచ్చరిక
- మేడిగడ్డపై సీఎం చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని స్పష్టీకరణ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, కానీ రేవంత్‌రెడ్డి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో హిట్లర్ తనకు ఆదర్శమని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారని, ఇప్పుడు కూడా అదే తరహా భాషను ఉపయోగిస్తూ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.
తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అంశాలపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో సీఎం దృష్టి మళ్లించే ప్రయత్నం మిగతా 2లో..

# నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతావా..

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు
- రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం
- అన్నదాతలకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్న
- తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ చేసిన సేవలేంటో చెప్పాలని సవాల్
- తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పాత్రపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు
- 1952, 1969 ఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు
- మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలను గుర్తు చేసిన కేటీఆర్
- రైతుల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని స్పష్టం
- జలసాధన కోసం బీఆర్ఎస్ చేసిన పోరాటాలను గుర్తు చేసిన మాజీ మంత్రి
- ఎండిపోతున్న పంట పొలాలకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శల వర్షం కురిపించిన కేటీఆర్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్ర విమర్శలు చేశారు. రైతన్నల కోసం నీళ్లు అడిగితే తమపై ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్నదాతల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ వరుస పోస్టులు చేశారు. తెలంగాణను దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధికి ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ కోసం పోరాడిన యువతపై మిగతా 2లో..

# సైకో కిల్లర్ ఎక్కడ?

- షాబాద్ హంతకుడు రాజ్‌కుమార్ వేటలో విస్తుపోయే నిజాలు
- పెట్రోల్ అయిపోవడంతో కారును వదిలేసిన రాజ్‌కుమార్
- రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం విఫలం
- 3 ఫోన్లు, 12 సిమ్ కార్డులతో తప్పించుకునే ప్లాన్
- శ్రీశైలం, బెంగళూరు మార్గాల్లో పోలీసుల గాలింపు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని నరమేధం సృష్టించిన ఉదంతంలో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ ఆచూకీ కోసం పోలీసులు జరిపిన గాలింపు చర్యల్లో అత్యంత ఆసక్తికరమైన, ఉత్కంఠభరితమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు రాత్రింబగళ్లు శ్రమిస్తున్నప్పటికీ, అతను పోలీసుల కళ్లు గప్పుతూ సాగిస్తున్న తప్పించుకునే పర్వం తీవ్ర సస్పెన్స్‌ను రేకెత్తిస్తోంది.

**కారులో పెట్రోల్ ఖాళీ.. రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం డ్రామా**

హత్యలు చేసిన అనంతరం పోలీసుల మిగతా 2లో..

# కాళేశ్వరం అవినీతిపై చర్యలు ఎక్కడ?

- సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన కిషన్‌రెడ్డి
- కేసీఆర్ కుటుంబంతో రేవంత్‌కు రహస్య సంబంధాలున్నాయని ఆరోపణ
- కాళేశ్వరం అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న
- లక్ష కోట్ల రూపాయలు వసూలు చేస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని నిలదీత
- రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ సంస్థలు లేవా? అంటూ విమర్శ
- బీజేపీ నేతలను విమర్శించే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- నేటి నుంచి రెండు రోజుల పాటు 'సింగరేణి భరోసా యాత్ర' ప్రకటించిన కిషన్‌రెడ్డి
- హైదరాబాద్ బస్తీల్లో మౌలిక వసతులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వెల్లడి
- తాగునీరు, వీధిలైట్లు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్య
- పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డికి రహస్య సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబం నుంచి లక్ష కోట్ల రూపాయలు వసూలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు.
కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన అక్రమాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కిషన్‌రెడ్డి నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ సంస్థలు లేవా? లేక విచారణను మిగతా 2లో..

# జులై 23న ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ


- మాజీ సుప్రీం లీడర్ స్మారక సభకు ఏర్పాట్లు
- టెహ్రాన్‌లో సాయంత్రం జరిగే కార్యక్రమం
- కీలక నేతలంతా హాజరయ్యే అవకాశం
- తొలిసారి బహిరంగంగా కనిపించనున్న మొజ్తబా
- భద్రతతోనే ప్రజల ముందుకు రానున్న నేత
- తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉన్న మొజ్తబా
- దాడిలో గాయపడినట్లు ప్రచారం
- ఇరాన్‌పై దాడులను ఖండిస్తున్న సుప్రీం లీడర్
- ప్రతీకారం తీర్చుకుంటానన్న తాజా హెచ్చరిక
- ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న స్మారక సభ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ త్వరలో ప్రజల ముందుకు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జులై 23న టెహ్రాన్‌లో మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారక సభను ఆయన నిర్వహించనున్నట్లు సమాచారం. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి మిగతా 2లో..

# దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి



- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- ఆలయాల్లో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు
- బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి
- వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి
- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకారానికి హాజరు
- ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- దేవాలయాల అభివృద్ధితో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తామని వెల్లడి
- గ్రేటర్ వరంగల్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు
- మేయర్ సీటు గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచన
- ప్రజలకు చేరువయ్యేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఆకాంక్ష

02

# కేసీఆర్, హరీష్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.!

- కేసీఆర్, హరీశ్‌కు క్షమాపణ డిమాండ్
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటు కౌంటర్
- ఈటెల రాజేందర్‌పైనా విమర్శలు
- తుంగతుర్తి వివాదంపై స్పందన



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాళేశ్వరం ప్రాజెక్టు , సాగునీటి అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి ప్రధాన కారణమైన కేసీఆర్, హరీష్ రావులు ముందు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల మిగతా 2లో..

# హింసను ప్రేరేపించేలా రేవంత్ వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి**

చేస్తున్నారని విమర్శించారు. నిన్న చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, వాటిపై రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. షాబాద్‌లో జరిగిన ఘటనపై పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించినప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమని హరీశ్‌రావు అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల అంశాల్లో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలపైనా హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 31 నెలలు పూర్తయినా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పనితీరు, సాంకేతిక అంశాలపై రేవంత్‌రెడ్డికి ఇప్పటికీ సరైన అవగాహన రాలేదని విమర్శించారు. విశ్రాంత ఇంజినీర్లు, నీటిపారుదల శాఖ అధికారులు మేడిగడ్డ వద్ద నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

రైతులకు సాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. వాస్తవాలు మాట్లాడిన వారిని జైలుకు పంపిస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించిన వారిపై ఒత్తిడి తీసుకురావడం కంటే, వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుపై హైదరాబాద్‌తో పాటు అనేక జిల్లాలు ఆధారపడి ఉన్నాయని హరీశ్‌రావు గుర్తు చేశారు. నీటి వంటి అత్యంత కీలకమైన అంశంలో రాజకీయాలు చేయడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకే నష్టం జరుగుతుందని హెచ్చరించారు. కరవు పరిస్థితులు మరింత జటిలం కాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించి రైతులకు అవసరమైన నీటిని అందించాలని డిమాండ్ చేసిన హరీశ్‌రావు, పంప్‌హౌస్ బటన్లు నొక్కడానికి బదులుగా ప్రభుత్వం ప్రతిపక్షాల కంఠం నొక్కడంపై దృష్టి పెట్టిందని విమర్శించారు. మేడిగడ్డ అంశంపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవాలని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

# కాళేశ్వరం అవినీతిపై చర్యలు ఎక్కడ?

**మొదటిపేజీ తరువాయి**

ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందా? అని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులను విమర్శించే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

సోమవారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సింగరేణి భరోసా యాత్ర' చేపడుతున్నట్లు కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ యాత్రలో బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు.

కాచిగూడ డివిజన్‌లో నిర్వహించిన పాదయాత్ర అనంతరం మాట్లాడిన కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి శనివారం, ఆదివారం బస్తీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో బస్తీలను సందర్శించిన సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత అనేక రహదారులు దెబ్బతిన్నాయని, వీధిలైట్లు పనిచేయక బస్తీలు చీకట్లో మగ్గుతున్నాయని చెప్పారు. పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోందని విమర్శించారు. తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. వర్షాకాలం వచ్చినప్పటికీ చివరి బస్తీలు, ఇళ్ల వరకు తాగునీరు అందడం లేదని, దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణం, పెన్షన్ల మంజూరుపై కూడా ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాలాకాలమైనా అర్హులకు పెన్షన్లు అందడం లేదని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, నిరుద్యోగ యువతకు రూ.4,000 భృతి, యువతులకు స్కూటీలు, వివాహ సమయంలో తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం ఎప్పుడు



అమలు చేస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధిపైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని కిషన్‌రెడ్డి విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హైటెక్ సిటీ అభివృద్ధికే పరిమితమైందని ఆరోపించారు. సికింద్రాబాద్, అంబర్‌పేట్, సనత్‌నగర్, గౌలిగూడ, ఓల్డ్‌సిటీ, ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అధికారులు వెంటనే స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతావా..

**మొదటిపేజీ తరువాయి**

ఎన్‌కౌంటర్లు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పాలనను విమర్శించారు.

1952లో ఏడుగురు యువకులను కాల్చిచంపింది కాంగ్రెస్ ప్రభుత్వమే కాదా? అని ప్రశ్నించిన కేటీఆర్, 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో 369 మందిపై తూటాల వర్షం కురిపించారని ఆరోపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ వేలాది మంది యువత ప్రాణత్యాగాలు చేశారని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. రైతన్నల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తెలంగాణ సాధన కోసం నీళ్లలో నిప్పులు పుట్టించేలా జలసాధన పోరాటాలు చేశామని గుర్తు చేశారు.



రాష్ట్రంలో ఎండిపోతున్న పంట పొలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఆ దిశగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# జులై 23న ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ

**మొదటిపేజీ తరువాయి**

దేశంలోని కీలక రాజకీయ, మత నాయకులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొజ్తబా ఖమేనీ ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. భద్రతా కారణాల దృష్ట్యా తన తండ్రి అంత్యక్రియలకు కూడా ఆయన హాజరుకాలేదని సమాచారం. అలాగే రెండు వారాల క్రితం జరిగిన తన భార్య అంత్యక్రియల్లోనూ ఆయన కనిపించలేదు.

మొజ్తబా ఖమేనీకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒకరు ఫిబ్రవరి 28న జరిగిన దాడుల్లో మరణించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అదే దాడిలో మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఇరాన్‌పై జరిగిన దాడులను ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా



ఖండిస్తూ వస్తున్నారు. తాజాగా శనివారం చేసిన సోషల్ మీడియా పోస్టులో తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో జులై 23న జరగనున్న స్మారక సభపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

# కరాటే పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్న కానిస్టేబుల్ అరుణ్ కుమార్

**నిజామాబాద్ కోటగిరి/ జూలై 12/(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి పోలీస్ స్టేషన్‌కు ఇది ఎంతో గర్వకారణమైన క్షణం. ఇక్కడ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ. అరుణ్ కుమార్, ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు.మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ హైప్రొఫైల్ క్రీడాకూటంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ సిబ్బంది నుండి తీవ్రమైన పోటీ ఎదురైంది. ఈ పోటీలలో కానిస్టేబుల్ అరుణ్ కుమార్ అసాధారణమైన మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలను, క్రమశిక్షణను మరియు పట్టుదలను ప్రదర్శించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆయన సాధించిన ఈ అద్భుతమైన విజయం కోటగిరి పోలీస్ స్టేషన్‌తో పాటు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ మొత్తానికి ఎంతో కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చింది.సబ్ ఇన్‌స్పెక్టర్ అభినందనలుఈ సందర్భంగా కోటగిరి పోలీస్ స్టేషన్ సబ్




ఇన్‌స్పెక్టర్ (SI) జి. శ్రీనివాస్ గారు అరుణ్ కుమార్‌కు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఇలా పేర్కొన్నారు:"మన స్థానిక పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒక సిబ్బంది రాష్ట్ర స్థాయి బంగారు పతకాన్ని సాధించడం మాకు దక్కిన గౌరవం. అరుణ్ కుమార్ తన పోలీస్ విధులను నిర్వహిస్తూనే, కరాటే క్రీడలో కఠినమైన శిక్షణను ఎంతో చక్కగా సమతుల్యం చేసుకున్నారు. ఆయన పట్టుదల కోటగిరి పోలీస్ స్టేషన్‌కు ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టింది."


# సైకో కిల్లర్ ఎక్కడ?

**మొదటిపేజీ తరువాయి**

నుండి తప్పించుకోవడానికి రాజ్‌కుమార్ కారులో వేగంగా పరారయ్యాడు. అయితే, చేగూరు ప్రాంతానికి చేరుకునే సరికి కారులో పెట్రోల్ అయిపోవడంతో విధిలేక వాహనాన్ని అక్కడే వదిలేశాడు. అక్కడ నుండి కాలినడకన తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న ఒక రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ, చివరి నిమిషంలో ధైర్యం సరిపోక చచ్చేందుకు భయపడి ట్రాక్ కిందకు దూకేశాడు. ఆ తర్వాత అతను అక్కడి నుండి ఎటు వైపు వెళ్లాడు, ఎక్కడ తలదాచుకున్నాడు అనేది పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది.

**3 ఫోన్లు.. డజనుకు పైగా సిమ్ కార్డులు**

రాజ్‌కుమార్ సాధారణ నేరస్థుడిలా కాకుండా పక్కా ప్లానింగ్‌తో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. అతని వద్ద సుమారు మూడు మొబైల్ ఫోన్లు, డజనుకు పైగా (12 కి పైగా) వేర్వేరు సిమ్ కార్డులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, సాంకేతిక ఆధారాల ద్వారా పోలీసులు తనను పసిగడతారనే భయంతో ప్రస్తుతం అతను ఆ ఫోన్లను, సిమ్ కార్డులను వాడటం లేదని నిర్ధారణ అయ్యింది. అయినప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడైనా ఒక సిమ్ కార్డ్ ఆన్ చేసినా వెంటనే పట్టుకోవాలనే వ్యూహంతో



పోలీసులు అతనికి సంబంధించిన అన్ని నంబర్లను ప్రతిక్షణం సైబర్ సెల్ సహాయంతో ట్రాక్ చేస్తున్నారు.

**శ్రీశైలంతో పాటు బెంగళూరు హైవేపై పోలీసుల గాలింపు**

నిందితుడి వేట కోసం పోలీసులు ఏకంగా 12 ప్రత్యేక బృందాలను (Teams) రంగంలోకి దించారు. ఇప్పటికే తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్ల సీసీటీవీ (CCTV) ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. రాజ్‌కుమార్‌కు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రెగ్యులర్‌గా వెళ్లే అలవాటు ఉందని విచారణలో తేలడంతో.. అతను అక్కడ సాధువుల రూపంలో గానీ, భక్తుల మధ్య గానీ దాక్కునే అవకాశం ఉందని భావించి శ్రీశైలంలో ప్రత్యేక బృందాలు మోహరించాయి. దీనితో పాటు బెంగళూరు హైవే పరిసర ప్రాంతాలు , పొరుగు రాష్ట్రాలలో కూడా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

# కేసీఆర్, హరీష్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.!

ప్రజా ధనాన్ని వృధా చేసి, రాష్ట్రానికి భారీ నష్టం చేకూర్చినందుకు గానూ ముక్కు నేలకు రాసి, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు.

**హరీష్ రావుకు రక్తం చిందించే ధైర్యం లేదు**

రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోస్తామంటూ కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలను జగ్గారెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. హరీష్ రావును రక్తం చిందించమని చెప్పినా ఆయన ఆ పని చేయరని, అసలు రక్తం చిందించే అంత ధైర్యం హరీష్‌కు లేదని ఎద్దేవా చేశారు. "తెలంగాణ ఉద్యమం పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఎంతోమంది యువకులు బలిదానాలు చేసుకున్నారు. ఆ సమయంలో హరీష్ రావు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్టు డ్రామా ఆడాడు కానీ.. అగ్గిపెట్టె మాత్రం తెచ్చుకోలేదు. పెట్రోల్ తెచ్చుకున్న వాడు అగ్గిపెట్టె తెచ్చుకోలేడా?" అంటూ జగ్గారెడ్డి తీక్షణమైన ప్రశ్నలు సంధించారు. తమకు నచ్చినట్టు నడుచుకోకపోతే అవతలి వారిని సైకోలు అంటారా అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏదో ఒక రకంగా నిందించాలనే ఒకే ఒక్క లైన్ పెట్టుకుని హరీష్‌రావు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో హింసకు, రెచ్చగొట్టే స్వభావానికి కేసీఆర్ ఇల్లే కేరాఫ్ అడ్రస్ అని, ఆ లక్షణాలు వారి కుటుంబానికే చెల్లుతాయని ఆరోపించారు.

కాళేశ్వరం పునరుద్ధరణ విషయంలో ఎన్‌డీఎస్‌ఏ (NDSA) నిపుణుల కమిటీ ఏం చెబితే అది చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. నేరుగా ఎన్‌డీఎస్‌ఏ దగ్గరికే వెళ్లి తేల్చుకుందాం రమ్మంటే హరీష్ రావు నుండి ఎలాంటి స్పందన లేదని నిలదీశారు. ఇదే సమయంలో బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌పై కూడా జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. గతంలో ఈటెల ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు కాబట్టే, ఇప్పుడు లోపాయికారీగా బీఆర్ఎస్ నేతలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "నువ్వు ఇప్పుడు బీజేపీలో కీలకమైన పదవిలో ఉన్నావు కదా.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కేసీఆర్, హరీష్ రావులను ఢిల్లీకి తీసుకువెళ్లు. మా కాంగ్రెస్ మంత్రులు కూడా వస్తారు. అంతేకానీ అది చేయకుండా ఇక్కడ వృధాగా ఎందుకు మాట్లాడుతున్నావు?" అని ఈటెలకు హితవు పలికారు. రైతులకు మేలు చేసేందుకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, మాట ఇస్తే నిలబెట్టుకోవడం తమ రాజకీయ సంస్కృతి అని, అది బీఆర్ఎస్, హరీష్ రావుల సంస్కృతి కాదని స్పష్టం చేశారు.

తుంగతుర్తి పంచాయితీపై జగ్గారెడ్డి వ్యాఖ్యలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారిన తుంగతుర్తి నియోజకవర్గ పంచాయితీపై కూడా జగ్గారెడ్డి స్పందించారు. ప్రస్తుతం తుంగతుర్తి వ్యవహారానికి సంబంధించిన పోస్ట్‌మార్టం (పరిశీలన) జరుగుతోందని, అక్కడ తలెత్తిన సమస్యలను ఎలా సెట్ చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రాజకీయాల్లో కోపతాపాలు సహజమని, నియోజకవర్గానికి చెందిన అందరి అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. దీనిపై రేపటికల్లా తుది నివేదిక (రిపోర్ట్) సిద్ధం చేసి పార్టీ అధిష్టానానికి అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పంచాయితీలు, గొడవలు రావడం చాలా సహజమని, "పంచాయితీలు అంటేనే కాంగ్రెస్" అని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయ పార్టీల్లోనూ గొడవలు ఉంటాయని, కాకపోతే తమ పార్టీ వాళ్లు ఏమైనా ఉంటే బహిరంగంగా బయట మాట్లాడతారని, మిగిలిన పార్టీల నేతలు మాత్రం లోపల మాట్లాడుకుంటారని.. కేవలం ఆ ఒక్కటే తమకు, మిగతా వారికి ఉన్న తేడా అని జగ్గారెడ్డి వివరించారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

- **రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ**
- **ఆలయాల్లో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు**
- **బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి**
- **వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి**
- **గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకారానికి హాజరు**
- **ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
- **దేవాలయాల అభివృద్ధితో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తామని వెల్లడి**
- **గ్రేటర్ వరంగల్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు**
- **మేయర్ సీటు గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచన**
- **ప్రజలకు చేరువయ్యేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఆకాంక్ష**
- **వరంగల్‌లో కాంగ్రెస్ విజయానికి అందరూ సమన్వయంతో ముందుకు రావాలని పిలుపు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేవాలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇప్పటికే ఆలయాల్లో వేలాది కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఊతమివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఆదివారం వరంగల్ నగరంలో పర్యటించిన మంత్రి కొండా సురేఖ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆధ్యాత్మిక క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే కార్యాచరణ అమలులో ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపైనా మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వరంగల్ మేయర్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి కొండా సురేఖ సూచించారు.

# భీం ఆర్మీ–ఆజాద్ సమాజ్ పార్టీలో భారీ చేరికలు

- **కొల్లారి గ్రామంలో నూతన కమిటీ నియామకాలు**
- **సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపు**

**డిడి 9 వార్త గుడిహత్నూర్,:**

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని కొల్లారి గ్రామంలో భీం ఆర్మీ-ఆజాద్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ చేరికల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు, ప్రజాప్రతినిధులు పార్టీలో చేరగా, నూతన కమిటీని ప్రకటించారు. పార్టీ నిర్ణయం మేరకు సోన్‌కాంబ్లే రాజనీకాంత్‌ను బోత్ నియోజకవర్గ అధ్యక్షుడిగా, దైకాంబ్లే అమిత్‌ను జిల్లా జాయింట్ సెక్రటరీగా, దైకాంబ్లే సునీల్‌ను గుడిహత్నూర్ మండల అధ్యక్షుడిగా నియమించారు. అలాగే డి.కె. రాజ్‌కుమార్, కాంబ్లే మధుకర్లను ప్రధాన కార్యదర్శులుగా ప్రకటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భీం ఆర్మీ-ఆజాద్ సమాజ్ పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అస్లం, నాయకులు ఆసిఫ్ హుస్సేన్, ఫెరోజ్ ఖాన్, బేలా మండల అధ్యక్షుడు సోజర్, నారాయణ షిండే, జాదవ్ మిలన్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జావిద్ ఖాన్, జగన్, కొల్లారి గ్రామ మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- **కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి**
- **ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం**
- **సభాధ్యక్షులు రాయించు నాగరాజు**
- **ములుగు మండల బీజేపీ కార్యవర్గ సమావేశం**

**డీ డీ 9 వార్త, ములుగు**

ములుగు మండల భారతీయ జనతా పార్టీ కార్య వర్గ సమావేశం ములుగులో మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిం చబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం గారు హాజరై పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిం చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ సి ద్ధాంతాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసు కెళ్లాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు విస్తృతంగా వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు.

అదేవిధంగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు మరియు ఇతర వర్గాలు ఎదుర్కొం టున్న సమస్యలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడం లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టా లని, అభివృద్ధి మరియు సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే విధంగా ప్రభుత్వం పనిచేయాలని ఆయన కోరారు. అదే సమయంలో ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజల తరపున నిరంతరం పోరాటం కొ



నసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు సీనియర్ నాయకులు దొంతి రెడ్డి రవి రెడ్డి,మండల ఉపాధ్యక్షులు హేమాద్రి, మండల ప్రధాన కార్యదర్శిలు లకావత్ రాజ్ కుమార్,కుక్కల పవన్ కళ్యాణ్, కార్యదర్శులు గుండెబోయిన శ్రీహరి గౌడ్, వేల్పుల రఘువీర్, యాట సాగర్, బద్దుల లక్ష్మి, కోశాధికారి వైనాల సంపత్,బూత్ అధ్యక్షులు ఓదెల జనార్ధన్, సము ద్రాల అశోక్, శ్రీరాముల రాజేందర్, మేకల రవి, గొంగళ్ళ కట్టయ్య , అప్పని సురేష్, వంశీ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ కళాకారుడు కామ్రేడ్ నాగన్నకు ఘన నివాళులు

- **మంథని నియోజకవర్గ కళాకారుల ఆధ్వర్యంలో సంతాప సభ**
- **అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన కళాకారులు**
- **పాటలతో, కవితలతో నాగన్న సేవలను స్మరించిన కవులు, గాయకులు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 12(డీడీ9 వార్త):**

అరుణోదయ కళాకారుడు కామ్రేడ్ నాగన్న మృతికి మంథని నియోజకవర్గ కళాకారులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నాగన్న చిత్రపటానికి పూలమాల లు వేసి, పుష్పాంజలి ఘటిస్తూ సంతాపం ప్రక టించారు.

ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు ఆకుల వెంకన్న, అశోక్ మాట్లాడుతూ ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో కామ్రేడ్ నాగన్న అందించిన సేవలు చిరస్మరణీయమని కొని యాడారు. ఆయన పాటలు, కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని పేర్కొంటూ నివాళులర్పించారు.

అనంతరం కవులు, గాయకులు నాగన్నను స్మరిస్తూ విప్లవ గీతాలు ఆలపించారు. ఆయన జీవితం, ఉద్యమ స్ఫూర్తిని కొనియాడుతూ పాటలు, కవితల రూపంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, అరుణో దయ కళాకారులు చిట్కాల యాకుబ్, పులిపాక బాలయ్య, చిలుక సమ్మయ్య, దుబాసి శ్రీనివాస్, వడ్డకొండ రవివర్మ, బియ్యని తిరుపతి, కనకల క్ష్మి, సమ్మయ్య, సాంబయ్య తదితర కళాకారులు, కవులు, గాయకులు పాల్గొని కామ్రేడ్ నాగన్నకు ఘనంగా నివాళులర్పించారు.



# ఆదివాసులకు రాజ్యాధికారమే అన్ని సమస్యలకు పరిష్కారం,

- **మా ఊళ్ళో మా రాజ్యం కొరకై పోరాటాలు చేయండి - ఆదివాసి సేన సలహాదారులు గుండు శరత్**


**తాడ్వాయి మండలం (డిడి9 వార్త రిపోర్టర్)**

మేడారం, జూలై 12: ఆదివాసుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేఖ వైఖరికి నిరసనగా పోరాటాల చేపట్టాలని అందుకు మా ఊళ్ళో మా రాజ్యం నినాదంతో ముందుకు సాగాలని అప్పుడే రాజ్యాధికారం చేపడతామని ఆదివాసిసేన సంఘ సలహాదా రులు గుండు శరత్ పిలుపు నిచ్చారు.

ఆదివారంనాడు ,ములుగు జిల్లా సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం మేడారం కేంద్రంగా జరుగుతున్న ఆదివాసీసేన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో రెండవ రోజు ముఖ్యవక్తగా గుండు శరత్ ప్రసంగిస్తూ ఐదవ షెడ్యుల్ ప్రాంతాల్లో అక్రమ వలసలు అరికట్ట యి ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని , దాని ఫలితంగా ఆదివాసి సంస్కృతి సాంప్రదా యాలు, హక్కులు చట్టాలకు ముప్పు పొంచి ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి నేటికి ఢబై తొమ్మిదేళ్లు అవుతున్న గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని అందుకు నిదర్శనం ఐటిడిఏ కేంద్రాల పనితీరు నిదర్శనమన్నారు. మైదాన ప్రాంత కులాలకు లేని గుర్తింపు ఇచ్చి, ఆదివాసుల ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కులనూ, అవకాశాలను హరించరన్నారు. పాలన వ్యవస్థలో వైఫల్యం చెందితే, ఆదివాసు లు తమ స్వయంపాలన మండళ్లు ఏర్పాటు చేసుకునే వెసులబాటు రాజ్యాంగం కల్పించిద న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు ఖర్చు చేసిన చేసిన నిధులపై శ్వేతపత్రం ప్రక టించాలని డిమాండ్ చేసారు.

తొలుత ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర ప్రతిని ధి బృందం మేడారం సమ్మక పగిడిద్ద రాజం, సారాలమ్మ గోవింద రాజల గద్దెలను సాంప్ర దాయ పద్దతిలో పూజలను నిర్వహించి దర్శిం చుకున్నారు.


రెండవ రోజు జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోయ, గోండు, కొండ రెడ్డి, నాయకపోడ్, తోటి, మన్నేవార్ , ప్రధాన్, చెంచు తెగల సమస్యలపై చర్చించి పలు తీ ర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు కోవా దౌలత్ రావు, మడి సాయిబాబు లతో పాటు, రాష్ట్ర నాయకులు సొడే వెంకటేశ్వర్లు, కొమరం అనిల్ కుమార్, ఊకే రవి, చింత ఆరుణ, రాయిసిండం జంగు పటేల్, కొర్స నరేష్, పొడెం సమ్మయ్య, బల్మూరి రామస్వా మి, యానక లక్ష్మీనారాయణ, శెట్టిపల్లి శ్రీను, కల్తీ నరేష్ , పోలెబోయిన ఆదిగారాయణ, వజ్జా జ్యోతి బస్సు, మూతి లక్ష్మి, ఆలం శ్రీను, వెంకట్, కాక సురేష్, బొల్లి శ్రీనివాస్, పూనెం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు ను సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు.

**మణుగూరు.జూలై 12 (డి డి 9వార్త)**

కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు గారు అయోధ్య రామ మందిరంలో జరిగినటువంటి అక్రమాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిం చుటకు, 13/07/2026 సోమవారం నాడు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయం సన్నిధిలో అక్రమాలపై మౌన దీక్ష చేయుటకు వెళుతున్నటువంటి సందర్భంలో.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,సుజాతనగర్ గ్రామం లోని జిల్లా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలపూడి రాజశేఖర్ గారి ఇంటి వద్దకు రావడం జరిగింది. ఈ వార్త తెలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై హనుమంతరావు కు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కొత్త సీ తారాములు రాష్ట్ర ఐ ఎన్ టి యు సి సెక్రటరీ రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ ఉపాధ్యక్షులు శ్యామ్ మోహన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవి ప్రసన్న, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, లక్ష్మణ్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ లు పైడా రాజేంద్రప్రసాద్, లోశెట్టి నాగార్జున్, సుజాతనగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్ర అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొని వి హనుమంతరావు కు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు.



# ములుగు జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి

- **వాతావరణ శాఖ సూచన మేరకు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వర్షపాతం తక్కువ ఉన్నందున రైతులు పంటల సాగులో జాగ్రత్త పడాలని సూచించిన ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి**

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త రిపోర్టర్)**



ఆదివారం రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు ములుగు జిల్లా రైతులకు పంటలు సాగు విషయంలో సూచనలు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి రాష్ట్రంలో ప్రస్తుతం వాతావరణంలో నెలకొన్న పరిస్థితు ల్లో వర్షపాతం తక్కువ నమోదయ్యే అవకాశం ఉన్నందున ములుగు జిల్లాలోని రైతులు ప్రత్యా మ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు ఉదాహరణకు వర్షాలు తక్కువగా పడ్డా కూడా పండపంటలు,మొక్కజొన్న,కందులు,పెసర్లు, వేరుసెనగ,మొదలగు పంటలు సాధారణ వర్షా లకు కూడా అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున ఇలాంటి పంటలకు కూడా ప్రభు త్వం మద్దతు ధరలు అందిస్తుందని రైతులు ఆలోచించి పంటలు వేసుకోవాలని అనవసరం గా నష్టాన్ని కలిగించే పంటలు వేసి బాధపడకూ డదని జిల్లా రైతులందరికీ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి సూచించారు

# రాష్ట్ర నాయకునికి జన్మదిన శుభాకాంక్షలు

**డీ డీ 9 వార్త, ములుగు**

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర నాయకులు వేంగపల్లి శ్రీను జన్మది నాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా అధ్యక్షుడు గడ్డం భద్రయ్య ఆదివారం జన్మదిన శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం ఉద్యమిస్తున్న రాష్ట్ర నాయకులు శ్రీను మరెన్నో జన్మదిన పండుగలు చేసుకోవాలని ఆయన కోరారు.






# జూలై 14న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

- **ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**
- **రూ.11 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్**
- **ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**
- **విద్యార్థులు, తల్లిదండ్రులు బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 12(డీడీ9 వార్త):**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అఖిల భారతీయ విద్యా ర్థి పరిషత్ (ఏబీవీపీ) గోదావరిఖని నగర సంయుక్త కార్యదర్శి ఓరుగొండ రుషిక్ ఆరో పించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలను డిమాండ్ చేస్తూ ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని వి ద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు.

ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ..., రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాల ర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసి స్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తు తం రూ.11 వేల కోట్ల బకాయిలు పేరుకు పోయాయని ఆరోపించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏడాది సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు మధ్యలోనే చదువును నిలిపివేస్తున్నార ని, మరో 4.5 లక్షల మంది విద్యార్థులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజు రీయిం బర్స్మెంట్ నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రస్తుతం విద్యాశాఖ తన వద్దే ఉన్నప్పటికీ బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నా రు. హక్కుల కోసం పోరాడుతున్న విద్యా ర్థులపై లాఠీచార్జీలు చేయించడం, అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యా నికి విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాల ర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యాసంస్థలు మరోసారి ఉద్యమాలకు కేంద్రాలుగా మారుతాయని హెచ్చరించారు. జూలై 14న నిర్వహించే రాష్ట్రవ్యాప్త బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రు లు, మేధావులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో ఏబీవీపీ నాయకులు ఆదిత్య, శ్రేహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యాభ్యాసానికి అండగా నిలిచిన వ్యాల్ల హరీష్ రెడ్డి

- **తెలంగాణ భవన్‌లో గీతాంజలికి ల్యాప్‌టాప్ అందజేత**
- **విద్యార్థులు ఉన్నత విద్యతో సమాజానికి సేవ చేయాలని ఆకాంక్ష**
- **వ్యాల్ల హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన అల్లి గణేష్ కుటుంబం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 12(డీడీ9 వార్త):**

రామగుండం నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ రామగుండం పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అల్లి గణేష్ కుమార్తె అల్లి గీతాంజలికి ఉన్నత విద్యాభ్యాసం కోసం అవసరమైన ల్యాప్‌టా ప్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి అందజేశారు. బి.ఫార్మసీ పూర్తి చేసిన గీతాంజలి ఉన్నత విద్యను కొ నసాగించేందుకు ల్యాప్‌టాప్ అవసరమని అల్లి గణేష్ హరీష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ల గా, ఆయన సానుకూలంగా స్పందించి ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా వ్యాల్ల హరీష్ రెడ్డి మాట్లాడు తూ, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గీతాంజలి ఉన్నత చదువు ల్లో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ల్యాప్‌టాప్ అందించిన వ్యాల్ల హరీష్ రెడ్డికి అల్లి గణేష్, ఆయన కుటుంబ సభ్యులు హృ దయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సం దర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# వికసిత్ తెలంగాణలో గిరిజనులకు స్వయం పాలన

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త రిపోర్టర్)**

ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం మండల కేంద్రంలో ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని సమ్మక్క పూజారి సిద్ధబోయిన సురేందర్ ముఖ్య అతిథిగా సమావేశం హాజరుకావడం చేయడం జరిగింది ఈ సమావేశం చెరుకుల గోపి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది

ముఖ్య అతిథి సిద్ధబోయిన సురేందర్ మాట్లాడుతూ వికసిత తెలంగాణ కోసం ఆదివాసి ప్రజలం అందరం కలిసి పని చేయాలని పిలుపు ఇచ్చారు ప్రతి గిరిజన గ్రామంలో పిసా చట్టం అమలు జరగాలి, ప్రతి గిరిజన గ్రామంలో పోడు భూముల పత్రం సర్వే చేసి హక్కు పత్రాలు మంజూరు చేయాలి అన్నారు, ఐటిడిఎలో 29 శాఖలు పునర్వ్యవస్థీకరణ చేయాలని అన్నారు గిరిజన ప్రాంతంలో విద్య కోసం, ఆరోగ్య భద్రతా కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి కేంద్ర ప్రభుత్వ పథకాలు పీయం జన్మన్, దర్తి అబా జనజాతి ఉత్కళ యోజన లాంటి కేంద్ర పతాకాలు అమలు చేయాలి అన్నారు, కొమరం భీమ్, బిర్సా ముండా, స్ఫూర్తితో వికసిత తెలంగాణ సాధించుకుందాం అన్నారు జల్ జంగిల్ జమీన్ రక్షణ మన సామాజిక బాధ్యత అన్నారు ఈ కార్యక్రమం లో నాయకులు పి రవీందర్, గోపి, రాజు, మదన్ తో పాటు ముఖ్య నాయకులు హాజరయ్యారు

# అశ్వాపురం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని పునరుద్ధరించండి.

- **తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామికి వినతి పత్రాన్ని అందజేసిన..**
- **మాల సంఘాల జేఏసీ నాయకులు చెట్టి సురేష్ , మేకల భాస్కర్.**

**మణుగూరు.జూలై 12(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు, గనుల శాఖ మంత్రివర్యులు, తెలంగాణ మాలల ముద్దుబిడ్డ, తెలంగాణ ఉద్యమ నేత డాక్టర్ జి వివేక్ వెంకటస్వామికి మాల సంఘాల జేఏసీ తరపున నాయకులు చెట్టి సురేష్, మేకల భాస్కర్ లు వినతి పత్రాన్ని అందజేశారు.ఇటీవల కాలంలో పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆర్ అండ్ బి మరియు జాతీయ రహదారుల అధికారులు తొలగించారని, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మరల అశ్వాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని తెలంగాణ మంత్రివర్యులు డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి కి పూర్తి వివరాలతో కూడిన వినతి పత్రం అందించడం జరిగింది. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన డాక్టర్ వివేక్ వెంకటస్వామి తప్పకుండా వివరాలు తెలుసుకొని అంబేద్కర్ విగ్రహం పునరుద్ధరణ పై చర్యలు తీసుకుంటానని సంబంధిత మాల సంఘాల జేఏసీ నాయకులకు హామీ ఇవ్వడం జరిగింది.



# ములుగులో మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

- **జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్**

**మంగపేట జూలై 12డీడీ9 వార్త**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూలై 13 (సోమవారం) ఉదయం 10 గంటలకు పర్యవేక్షించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పర్యటనను విజయవంతం చేయాలని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ కోరారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇరిగేషన్ & సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మరియు రెవెన్యూ శాఖ ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దేవాదుల ప్రాజెక్టును పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, బ్లాక్, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు.



# మెడికల్ బోర్డు సాధన కోసం జూలై 20 నుంచి నిరవధిక నిరాహార దీక్ష

- **రామగుండంలో కుటుంబ సభ్యులతో కలిసి 'వంటావార్పు' చేపడతామని హెచ్ఎంఎస్ ప్రకటింపు**
- **మెడికల్ బోర్డు, వారసత్వ ఉద్యోగాలు, హౌసింగ్ బోర్డు సొసైటీ ఏర్పాటు ప్రధాన డిమాండ్లు**
- **20లోపు అధికారిక ప్రకటన చేయకపోతే ప్రత్యక్ష పోరాటం తప్పదని యాజమాన్యానికి హెచ్చరిక**
- **కార్మికులంతా దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 12(డీడీ9 వార్త):**

సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ నెల 20వ తేదీ నుంచి రామగుండంలో కుటుంబ సభ్యులతో కలిసి 'వంటావార్పు-నిరవధిక నిరాహార దీక్ష' చేపట్టనున్నట్లు హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన నాయకులు ప్రకటించారు.

ఆదివారం నిర్వహించిన సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడుతూ.... కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఇటీవల చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు కొనసాగింపు, మారుపేర్ల (అలియాస్ నేమ్స్) సమస్యల పరిష్కారం, టెన్త్ పాస్ కాలేదనే కారణంతో నిలిపివేసిన వారసత్వ ఉద్యోగాల పునరుద్ధరణ, "సొంత ఇంటి పథకం" కింద హౌసింగ్ బోర్డు సొసైటీ ఏర్పాటు, పారదర్శక ప్రమోషన్ పాలసీ అమలు తమ ప్రధాన డిమాండ్లని తెలిపారు.

కార్మికుల సమస్యలపై పోరాడాల్సిన గుర్తింపు కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు యాజమాన్యానికి, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికుల ప్రధాన సమస్యలను పక్కనపెట్టి ఇతర అంశాలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను ప్రైవేటీకరణ కాకుండా సింగరేణికే దక్కేలా తమ పోరాటం కీలక పాత్ర




పోషించిందని నాయకులు పేర్కొన్నారు.

సింగరేణి యాజమాన్యానికి మరో ఏడు రోజుల గడువు మాత్రమే ఉందని, ఈ నెల 20లోపు మెడికల్ బోర్డుపై అధికారిక ప్రకటన చేయకపోతే కల్వకుంట్ల కవిత నాయకత్వంలో కార్మికులు ప్రత్యక్ష పోరాటానికి దిగుతారని హెచ్చరించారు. సోషల్ మీడియాలో స్పందించడం మాత్రమే కాకుండా కార్మికులందరూ పెద్ద ఎత్తున రామగుండం చేరుకుని నిరాహార దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గోశిక అశోక్, వెంకట్, ఆర్జీ1 జీ1 చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్, బ్రాంచ్ సెక్రటరీ క్రాంతి కుమార్, జాయింట్ సెక్రటరీ సతీష్, ఆర్జీ3 బ్రాంచ్ సెక్రటరీ గోస్క శ్రీకాంత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్కే వలి, పిట్ సెక్రటరీలు చందర్, రామ్ చరణ్, మహేందర్, రాజశేఖర్, విష్ణు, రాజేష్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీల హక్కుల కోసం పోరుబాట

**డిమాండ్లు నెరవేర్చకపోతే సచివాలయం ముట్టడిస్తాం: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**

**భద్రాచలం, జూలై 12 (డిడి9 వార్త)**

అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన హక్కులు సాధించాలంటే రాజీలేని పోరాటమే ఏకైక మార్గమని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పేర్కొన్నారు. అంగన్వాడీలకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ, మోయలేని పనిభారాన్ని మోపుతున్న ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల పాదయాత్రను ఆదివారం భద్రాచలంలో కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా మన్యం వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎర్రజెండాలు, అరుణ పతాకాలు చేతబూనిన అంగన్వాడీ ఉద్యోగులు, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు నినాదాల మధ్య పట్టణ ప్రధాన వీధుల గుండా పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రకు పలుచోట్ల ప్రజలు ఘన స్వాగతం పలికారు.

అంబేద్కర్ సెంటర్‌లో రెడ్డి అరుణ, గోనె మణి అధ్యక్షతన నిర్వహించిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీల సేవలను ప్రభుత్వం తగిన రీతిలో గుర్తించడం లేదన్నారు. విధులకు సంబంధం లేని అదనపు బాధ్యతలు అప్పగించడం వెట్టిచాకిరీ చేయించడమేనని విమర్శించారు. తక్కువ వేతనాలు, అధిక పనిభారం కారణంగా అంగన్వాడీ ఉద్యోగుల జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం సమంజసం కాదన్నారు. ఐసీడీఎస్‌కు తగిన బడ్జెట్ కేటాయించడం, నెలకు రూ.18 వేల వేతనం అమలు చేయడం, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, బీఎల్వో విధుల నుంచి మినహాయించడం, పదవీ విరమణ పొందిన వారికి బకాయిలు చెల్లించడం, పనిభారం తగ్గించడం వంటి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తే సహించబోమని స్పష్టం చేశారు.

రెండు రోజుల పాదయాత్ర తొలి రోజు భద్రాచలం మీదుగా సారపాక, బూర్గంపాడు, పాల్వంచ మండలంలోని జగన్నాథపురం వరకు కొనసాగింది. సారపాకలో ఐటీసీ కార్మిక సంఘాల నాయకులు హరిప్రసాద్, పోటు రంగారావు, నాగభూషణం తదితరులు సంఘీభావం ప్రకటించారు. రెండో రోజు సోమవారం జగన్నాథపురం పెద్దమ్మతల్లి ఆలయం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ వరకు చేరుకుని, అనంతరం కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, రాష్ట్ర ఉప కార్యదర్శి సీతామహాలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు సింగు నరసింహారావు, నరాటి ప్రసాద్, సీపీఐ, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, సరిరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, వేల్పుల మల్లికార్జున్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్వీఎస్ నాయుడు, మీసాల భాస్కరరావు, మారెడ్డి శివాజీ, కంభంమెట్టు శ్రీనివాస్, సాధనపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.




# ఉపరితల టెక్నీషియన్స్ పోస్టుల భర్తీపై హర్షం..

- **హెచ్.ఈ.ఎమ్.ఎమ్ ఖాళీలను కూడా త్వరితగతిన భర్తీ చేయాలి..**
- **ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

**మణుగూరు,జూలై 12 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి ఏరియాలోని ఉపరితల గనులు, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నీషియన్స్ పోస్టులను ట్రాన్స్ ఫర్ ప్రాతిపదికన కొండాపురం అండర్‌గ్రౌండ్ గనిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన కార్మికులతో భర్తీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడాన్ని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టి.బి.జి.కె.యస్) ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపరితల విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నీషియన్స్ పోస్టులను గుర్తించి అర్హులైన కార్మికులతో త్వరితగతిన భర్తీ చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించామని ఆయన తెలిపారు. పోస్టుల భర్తీ ఆలస్యం కావడంతో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన ఫలితంగానే భర్తీ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

తాజా ఉత్తర్వుల ప్రకారం కొండాపురం అండర్‌గ్రౌండ్ గనిలో విధులు నిర్వహిస్తున్న 9 మంది ఎలక్ట్రీషియన్లు, 5 మంది ఫిట్టర్లకు ఉపరితల విభాగంలో విధులు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా



అండర్‌గ్రౌండ్‌లో సేవలందించి, ఇప్పుడు ఉపరితల విభాగంలో పోస్టులు పొందిన టెక్నీషియన్స్ అందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

అదేవిధంగా, ఏరియాలో ఖాళీగా ఉన్న హెచ్.ఈ.యం.యం కేటగిరీ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు నియామకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అర్హత సాధించిన కార్మికులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. యాజమాన్యం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి హెచ్.ఈ.యం.యం కేటగిరీ ఖాళీలను కూడా త్వరితగతిన భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.


సంస్థ ప్రగతి, కార్మిక సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియాలో నిస్వార్థంగా పనిచేస్తోందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన తెలియచేశారు కార్మిక వర్గం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# మణుగూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **విద్యా రంగ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న పాయం.**

**మణుగూరు.జూలై 12(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు పట్టణంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదివారం నాడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మొదట మండలం లోని బిసి గర్ల్స్ హాస్టల్ లో రూ.15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే విద్యార్థినులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.అనంతరం మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో గల ఎస్టీ బాయ్స్ హాస్టల్ లో రూ.20 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయం భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.అనంతరం సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ సెంటర్ లో రూ.25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం,విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇంకా మాట్లాడుతూ, గ్రామాల, మరియు పట్టణాల సమగ్ర అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు,పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోపల పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు,మండల పట్టణ మరియు మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు,సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాష్ట్రంలో పరిపాలన 'చెత్త సినిమా'లా ఉంది: మాజీ మంత్రి పువ్వాడ

- **రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసైనా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి!**
- **అశ్వాపురం బీఆర్ఎస్ కార్యాలయంలో రేవంత్ ప్రభుత్వంపై ధ్వజం**
- **కాళేశ్వరం నీళ్లిస్తే కేసీఆర్ గొప్పతనం ఒప్పుకోవాల్సి వస్తుందనే కుయుక్తులు**
- **లక్షలాది క్యూసెక్కుల గోదావరి జలాలు సముద్రం పాలు.. రైతాంగానికి దక్కని ఫలాలు**

**మణుగూరు.జూలై 12(డి డి 9వార్త)**

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పరిపాలన ఒక చెత్త సినిమాను తలపిస్తోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భద్రాద్రి జిల్లా, అశ్వాపురం మండలం లోని నూతన బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుతో కలిసి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. రేవంత్ సర్కారుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక లేదని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్ లో రైతుల సమస్యలకు పరిష్కారం ఏంటని అడిగితే ప్రతిపక్ష నాయకుల రక్తం పారిస్తామనడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్తపిపాసి మనస్తత్వానికి నిదర్శనమన్నారు. "రైతులకు నీళ్లివ్వడానికి మా రక్తమే అడ్డమైతే.. ఆ రక్తాన్ని ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. పాపం పండిన నాడు హిట్లర్‌కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుంది" అని హెచ్చరించారు. ఎందరో ముఖ్యమంత్రులను చూశామని, కానీ ఇంతటి నోటిదూల ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదన్నారు.

మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసినా సీఎం రేవంత్ రెడ్డికి సోయి లేకపోవడం విచారకరమన్నారు. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీరు ప్రవహిస్తోందని, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చని గుర్తుచేశారు. మరో 100 రోజుల పాటు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుందని, రోజుకు 2 టీఎంసీల చొప్పున 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. "మేము మంత్రిగా ఉన్నప్పుడు ఇదే మేడిగడ్డ నుండి భద్రాచలం వరకు 25 లక్షల క్యూసెక్కుల నీళ్లు తెచ్చాం. అప్పుడు కొట్టుకుపోని భద్రాచలం.. ఇప్పుడు లక్ష క్యూసెక్కులు కూడా లేకపోయినా మునిగిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం నీళ్లు వస్తే ఎక్కడ కేసీఆర్ గొప్పతనం ఒప్పుకోవాల్సి వస్తుందో అని అనేక అబద్ధాలు చెప్పి దాన్ని పండబెడుతున్నారు" అని మండిపడ్డారు. మన పీకల మీద కడుతున్న పోలవరం పూర్తి అయితే భద్రాచలానికి ముప్పు వస్తుంది తప్ప.. మేడిగడ్డ వల్ల కాదని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో దేవుడి సాక్షిగా, భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి మీద ఆన అని చెప్పిన హామీలను రేవంత్ రెడ్డి గాలికొదిలేశారని పువ్వాడ విమర్శించారు. యూరియా దొరకడం లేదని రైతులు రోడ్డెక్కితే వారు అసలు రైతులే కాదనడం హాస్యాస్పదమన్నారు. డిసెంబర్ 9 నాడే రుణమాఫీ చేస్తామన్న రేవంత్ రెడ్డికి ఇప్పుడు ఆ ముచ్చటే గుర్తులేదన్నారు. గతంలో రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కేవలం ఒకట్రెండు ఎకరాలకు మాత్రమే ఇచ్చి తర్వాత జాడే లేకుండా చేశారని దుయ్యబట్టారు. అత్తా కోడళ్లకు ఇస్తామన్న మహిళల డబ్బులు ఏమయ్యాయని, పినపాక నియోజకవర్గంలో ఎవరికైనా ఆ డబ్బులు అందుతున్నాయా అని ప్రశ్నించారు. నిరుద్యోగుల పట్ల జాబ్ క్యాలెండర్ మోసపూరితంగా మారిందని, ఫీజు రీయంబర్స్మెంట్ అందక విద్యార్థుల జీవితాలు దారుణంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్‌కు డిస్కమ్‌ల లింక్ పెట్టి దానిని ఎత్తివేయడానికి కుయుక్తులు పన్నుతున్నారని, తెలంగాణ రాకముందు కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు, బీఆర్ఎస్ హయాంలో అద్భుత విద్యుత్ సరఫరాను ప్రజలు గమనించారని గుర్తుచేశారు.






బీఆర్ఎస్ హయాంలో పినపాక నియోజకవర్గంలో బీటీపీఎస్ ఫ్యాక్టరీ, మున్సిపల్ అభివృద్ధి, కలెక్టరేట్ల అభివృద్ధిని వేగవంతం చేశామని పువ్వాడ తెలిపారు. కానీ తాము దిగిపోయేటప్పుడు సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులు ఎక్కడ ఉన్నాయో.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 30 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అక్కడే ఉన్నాయని, పాలమూరు ప్రాజెక్టు పరిస్థితి కూడా దారుణంగా తయారైందని ఎద్దేవా చేశారు. ఇక్కడి నీళ్లను ఇతర ప్రాంతాలకు తీసుకుపోవడానికి చూపిస్తున్న ఉత్సాహం.. స్థానిక చెరువులు నింపడానికి మంత్రులు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు.సింగరేణిలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై పార్టీ పరంగా పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పువ్వాడ అజయ్ కుమార్ వెల్లడించారు. కాంగ్రెస్ చేసే విమర్శలకు బీఆర్ఎస్ పార్టీ భయపడి ముడుచుకు కూర్చోదని, మరింత ఘాటుగా స్పందిస్తూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.విలేకరుల సమావేశం అనంతరం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,ఖమ్మం మాజీ లోక్‌సభ ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, అశ్వాపురం సెంటర్‌లోని తుళ్లూరి ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ యార్లగడ్డ బలరాం మాతృమూర్తి దివంగత యార్లగడ్డ సువర్ణలత దశదిన (పెద్దకర్మ) కార్యక్రమానికి హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పార్టీ ముఖ్య శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాలల హక్కుల కోసం.. పదవులైనా వదులుకుంటా

- **ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధం: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**
- **భద్రాచలంలో ఘనంగా మాల ఉపకులాల ఐక్య మహా ర్యాలీ**
- **ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానంపై సీఎంకు వివరిస్తా**

**భద్రాచలం, జూలై 12 (డిడి9 వార్త):**

"మాల జాతికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోను. పదవులు ముఖ్యం కాదు, అవసరమైతే మా జాతి ప్రయోజనాల కోసం ప్రభుత్వంతోనైనా పోరాడటానికి సిద్ధం" అని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. భద్రాచలంలో ఆదివారం మాల, మాల ఉపకులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాలలు చిన్న చిన్న వర్గాలుగా విడిపోకుండా ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలరని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాల్లో తగిన వాటా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ విధానంలో వచ్చిన మార్పుల వల్ల ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అమలైన దామాషా విధానాన్ని, షమీమ్ అఖ్తర్ కమిషన్ నివేదికను పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే సీఎం, కేబినెట్ సబ్ కమిటీ దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లానని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళి..




బ్రిడ్జి రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జరిగిన భారీ ర్యాలీలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చిన మాల సంఘాల నాయకులు, ఉద్యోగులు, మహిళలు, యువత పాల్గొని తమ ఐక్యతను చాటారు. అంబేద్కర్ విగ్రహానికి మంత్రి వివేక్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**
- **నూతనంగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షులకు దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే పాయం.**

**మణుగూరు.జూలై 12(డి డి 9వార్త)**

ఇటీవల నూతనంగా నియమితులైన పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులతో పాటు మణుగూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇటీవల ఎన్నికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పార్టీ బలోపేతమే ప్రతి నాయకుడి ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామాన, ఇంటింటికీ తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.ప్రతి మండల అధ్యక్షుడు, టౌన్ అధ్యక్షుడు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా పని చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు, మణుగూరు టౌన్ అధ్యక్షుడిని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కూడా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నూతన అధ్యక్షులు ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రజావాణి కు అధికారులు సకాలంలో హాజరుకావాలి: సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ

**భద్రాచలం, జూలై 12(డిడి9 వార్త)**

భద్రాచలం డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి సోమవారం (జూలై 13) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఆదేశించారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు భూ సమస్యలతో పాటు వ్యక్తిగత, శాఖాపరమైన ఇతర సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు.



ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్వీకరించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని మృణాల్ శ్రేష్ఠ కోరారు.

# ప్రజావాణికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి: కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 12 (డిడి9 వార్త )**

జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజావాణి' కార్యక్రమానికి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, సోమవారం జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా, సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కలెక్టరేట్ లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల గురించి లిఖితపూర్వక వినతిపత్రాలను సమర్పించాలని, అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు వెంటనే స్వీకరించి, నిబంధనలకు లోబడి పరిష్కరించేందుకు




చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్ తో పాటు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నామని, జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

# డబ్బు గుంజేందుకే నా పరువు తీశారు

- **తప్పుడు ఎఫ్ఐఆర్‌తో తనను బ్లాక్‌మెయిల్ చేశారన్న శశాంక్ సింగ్**
- **డబ్బు గుంజడానికే పరువు తీసే కుట్ర జరిగిందని ఆరోపణ**
- **పనిలో పెట్టుకున్న వ్యక్తికి 9 కేసుల నేర చరిత్ర ఉందని వెల్లడి**
- **మా వాదన వినకుండానే కేసు నమోదు చేశారంటూ ఆవేదన**

**డి డి 9వార్త:**

ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ తనపై, తన కుటుంబంపై ఇటీవల నమోదైన కేసుపై తాజాగా స్పందించాడు. సెలబ్రిటీగా తనకున్న పేరును దెబ్బతీసి, డబ్బు గుంజేందుకే ఓ వ్యక్తి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సంచలన ఆరోపణలు చేశాడు. తనపై దాడి జరిగిందంటూ ఓ వంట మనిషి పెట్టిన కేసు పూర్తిగా కట్టుకథ అని, ఇది పరువు తీసి డబ్బు రాబట్టేందుకు పన్నిన కుట్ర అని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరించాడు.

గత నెలలో భోపాల్‌లోని తమ నివాసంలో పనిచేసే వంట మనిషిపై దాడి చేసి, ఫోన్ లాక్కున్నారని శశాంక్ సింగ్, ఆయన తండ్రి, రిటైర్డ్ స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై రతిబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను శశాంక్ పూర్తిగా ఖండించాడు.

"నిజానిజాలు తెలుసుకోకుండా వేలమంది నన్ను దూషించారు. ఒక నిరుపేదను కొట్టిన వ్యక్తిగా నన్ను చిత్రీకరించారు. ఈ ఘటన నన్ను మార్చేసింది, జీవితాంతం గుర్తుంచుకునే పాఠాలు నేర్పింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.

తమ వద్ద పనికి చేరిన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండేదని, ఇంట్లో తిరుగుతూ ఫొటోలు తీసి ఇతరులకు పంపేవాడని శశాంక్ తెలిపాడు. దీంతో మూడో రోజే అతడిని పనిలో నుంచి పంపించేశామని, అప్పుడు అతను ఆరోగ్యంగానే వెళ్లాడని స్పష్టం చేశాడు. "ఆ తర్వాత అతడు తీవ్రంగా గాయపడినట్లు వీడియోలో చూసి మేం షాక్ అయ్యాం. పోలీసు రికార్డుల ప్రకారం అతనిపై అప్పటికే హత్యాయత్నం, గృహ చౌర్యం, దాడి, బెదిరింపులు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు సహా మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. తన గుర్తింపును దాచుకోవడానికి మూడు వేర్వేరు పేర్లు వాడుతున్నాడు" అని శశాంక్ వెల్లడించాడు.

ఒక తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి, డబ్బు రాబట్టుకోవాలన్నదే అతని ప్రణాళిక అని తాను నమ్ముతున్నానని శశాంక్ పేర్కొన్నాడు. "సాధారణ బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే ఇబ్బంది పడుతుంటే, మా వైపు వాదన వినకుండానే ఇంత వేగంగా కేసు ఎలా నమోదు చేశారని ఆశ్చర్యపోయాను" అని అన్నాడు. ఏప్రిల్ 30న కూడా తాను ఇలాంటి పనే చేశానని వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. ఆ రోజు తాను ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్నానని, కనీస నిజ నిర్ధారణ లేకుండా వార్తలు రాసి పరువు తీస్తున్నారని విమర్శించాడు.

ఈ అనుభవంతో కొన్ని కఠినమైన పాఠాలు నేర్చుకున్నానని చెబుతూ, ప్రజలకు శశాంక్ ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "ఇంట్లో పనిచేసే వారిని నియమించుకునే ముందు రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా, పూర్తి పోలీసు వెరిఫికేషన్ తర్వాతే తీసుకోవాలి. జాలి అనేది ఇంగితజ్ఞానాన్ని భర్తీ చేయకూడదు. సత్యానికి సమయం పట్టినా, చివరికి అదే గెలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.



DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
సోమవారం
13-07-2026
హైదరాబాద్

## ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు...

- **బాలన్నగూడెం గ్రామ బీఆర్ఎస్ నాయకుడు తాటి బిక్షపతి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా నాయకులు తాటి కృష్ణ**

**మంగపేట జూలై12డీడీ9 వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తాటి బిక్షపతి ఇటీవల మృతిచెందడంతో, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు జిల్లా పార్టీ నాయకులు తాటి కృష్ణ ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా తాటి బిక్షపతి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని తాటి కృష్ణ భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య, పప్పు వెంకటరెడ్డి, మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ చిలకమర్రి రాజేందర్, మంగపేట పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, మాజీ ఎంపీటీసీ మూగల రమేష్, మూగల రాము, సుంకోజు ప్రశాంత్, బాలన్నగూడెం గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోదెం రాంబాబు, పార్టీ కార్యకర్తలు యాలం శ్రీనివాస్, పాయం పూర్ణచందర్ రావు, యాలం లక్ష్మీనారాయణ, కల్తీ శ్రీను, యాలం జగన్, కోరం సుధాకర్, చేరుకుల రాంబాబు, వాసం నవీన్, తోలేం కృష్ణమూర్తి, చందకృష్ణ, వట్టం చలమయ్య, యాలం చిన్ననర్సయ్య, గద్దె నరేష్ తదితరులు పాల్గొని బిక్షపతి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## గుంతలమయంగా మారిన ప్రధాన రహదారులు...

**చర్ల, జూలై 12( డిడి 9 వార్త)**


చర్ల నుండి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల అధ్యక్షుడు పాయల మోహన్ రావు ఆరోపించారు. ఆదివారం చర్ల మండలంలో నిర్వహించిన బీఎస్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో దోపిడీ పాలన సాగిస్తోందని విమర్శించారు. అక్రమ ఇసుక దందాపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధను ప్రజల సమస్యల పరిష్కారంపై చూపడం లేదని అన్నారు. అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చర్ల నుండి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి ఇసుక లారీల రాకపోకల కారణంగా గుంతలమయంగా మారి ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఇతర కార్యక్రమాలకు మాత్రమే పరిమితమవుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించిన సందర్భాలు కనిపించడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు అందడం లేదని, వాటి ప్రయోజనాలు కొందరికే పరిమితమయ్యాయని ఆరోపించారు. నిజమైన సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి బహుజన రాజ్యాధికారం ద్వారానే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధ్రువ నరసింహారావు, కాకా నరసయ్య, సోయం శ్రీమూర్తులు, కారం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

- **అధికారులు సకాలంలో హాజరుకావాలి: పీఓ బి. రాహుల్**

**భద్రాచలం, జూలై 12(డిడి9 వార్త)**



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం (జూలై 13) నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు తప్పనిసరిగా సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ ప్రారంభమవుతుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు స్వీకరించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పీఓ బి. రాహుల్ ఆదేశించారు. గిరిజనులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఏర్పాట్లు పూర్తి....

- **జిల్లాలో 1-19 సంవత్సరాల.1,81,425 మంది పిల్లలు గుర్తింపు....**
- **చేతుల శుభ్రత వల్ల అనేక వ్యాధులను నివారించవచ్చు**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్...**

**మెదక్ జూలై 12 (డిడి 9 వార్త)**



నేడు మెదక్ జిల్లాలో నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 13 జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (నేషనల్ డీ వార్మింగ్ డే) సంధర్భంగా 119 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంభందించిన ట్రైనింగ్ లను పి.హెచ్.సి.లలో పూర్తి చేశామని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాఠశాలలు, కళాశాలలలో ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అవగాహన కల్పిస్తున్నారని, జిల్లాలో 119 సంవత్సరాల పిల్లలు 1,81, 425 వుండగా 2,36,400 అల్బెండజోల్ మాత్రలు సిద్ధంగా ఉంచామని, అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరిపడ మాత్రలను పంపించామని, ఉదయం స్కూల్ లో ప్రార్థన చేసిన తర్వాత పిల్లలకు చేతుల పరిశుభ్రత, అల్బెండజోల్ మాత్రల గురించి తెలియజేయాలన్నారు. ఈ నెల 13 న మాత్రలు వేసుకోని పిల్లలకు ఈ నెల 20న మాపప్ కార్యక్రమం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అల్బెండజోల్ మాత్ర కడుపులో పెరిగే నులిపురుగులను నిర్మూలిస్తుంది. పిల్లలలో మంచి ఎదుగుదలతో పాటు చురుగ్గా, మానసిక శారీరక ఆరోగ్యంగా వుంటారు. అల్బెండజోల్ వల్ల పిల్లలకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు, నిపుణులైన పిల్లల వైద్యుల సేవలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. గోర్లు శుభ్రంగాను, చిన్నవిగా వుండాలని, శుభ్రమైన నీటినే త్రాగాలని, తినే పదార్థాలపై మూతలు పెట్టాలని, పండ్లు కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలని, భోజనం చేసేముందు, మరుగుదొడ్డిని ఉపయోగించిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, బహిరంగ మల విసర్జన చేయరాదన్నారు. ఈ మాత్రల వల్ల చదువులు, ఆట పాటల్లో చురుగ్గా వుండడం, మెరుగైన రక్తహీనత, మెరుగైన పోషకాహార స్థితి, పాఠశాలలో మెరుగైన హాజరు మొదలైన అనేక ప్రయోజనాలు వున్నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వొకేషనల్ కళాశాలలు, రిహాబిలిటేషన్ సెంటర్లు, రెస్క్యూ హోమ్స్, లేబర్ , మైగ్రెంట్, స్ట్రీట్ చిల్డ్రన్ హోమ్స్ , చైల్డ్ కేర్ హోమ్స్, అనాధ ఆశ్రమాలు, అంగన్వాడి సెంటర్లు అన్నీ చోట్ల వుండే పిల్లల కోసం ఆక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. మీ పిల్లలను నులిపురుగుల నుండి రక్షించాలని, 13 న అల్బెండజోల్ మాత్రలు వేసుకోని పిల్లల కోసం ఈ నెల 20 న మాపప్ కార్యక్రమం నిర్వహిస్తామని, జిల్లా అధికారులు , మీడియా, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, తలిదండ్రులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కలెక్టర్ అన్నారు.

## యం ఎస్ అగర్వాల్ పరిశ్రమను తొలిగించాలని దీక్ష చేసిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ వంటేరు ప్రతాప్ రెడ్డి.

**తూప్రాన్ జులై 12 (డిడి 9 వార్త )**



మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయి పల్లి. చెట్ల గౌరారం గ్రామాల పరిధిలో ఉన్నా యం ఎస్ అగర్వాల్ స్టిల్ పరిశ్రమ తో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదురుకొంటున్నారు అని వెంటనే ఈ స్టిల్ పరిశ్రమ తొలిగించాలని ఆదివారం రోజు గజ్వేల్ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి నిరాహార దీక్ష చెప్పటారు ఆయన మాట్లాడుతూ పరిశ్రమ

లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీనీ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు

ఎంఎస్ అగర్వాల్ కంపెనీ హటావో... రంగాయి పల్లి, చెట్ల గౌరారం గ్రామాలను బచావో.

అధైర్య పడకండి అండగా నేనుంటా కంపెనీని తొలగించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తా.అని ప్రతాప్ రెడ్డి అన్నారు

తమ లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఎంఎస్ అగర్వాల్ కంపెనీని వెంటనే తొలగించాలని రంగాయపల్లి గ్రామంలో నిరాహార దీక్ష చేసిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రంగాయపల్లి మరియు చెట్ల గౌరవం గ్రామ ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి మద్దతును తెలిపి ఎమ్మెస్ అగర్వాల్ కంపెనీ మాకు వద్దే వద్దు, మా ప్రాణాలే మాకు ముద్దు అని ప్రజలు ముక్తకంఠంతో నినాదించారన్నారు, ఎంఎస్ అగర్వాల్ కంపెనీ తొలగించేంతవరకు ప్రజల తరఫున పోరాటాలు చేస్తాం మా ప్రజల ప్రాణాలను మా పిల్లల ప్రాణాలను భవిష్యత్తులను కాపాడుకుంటాం వంటేరు వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు 20 సంవత్సరాలుగా ఎంఎస్ అగర్వాల్ కంపెనీ యాజమాన్యం వేలకోట్ల సంపాదించుకున్నారు, 20 సంవత్సరాల కాలంలో కంపెనీ నుండి వెలువడే విషపూరితమైన కాలుష్యం ద్వారా వందలాదిమంది చనిపోయారని వేలాదిమంది ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు, ఇంకా నీ కంపెనీ కాలుష్యానికి బలికాము,ఇన్ని సంవత్సరాలుగా సంపాదించుకున్నది చాలు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుకునేది చాలు ఇక నీకు కాలం దగ్గర పడింది తట్టా బుట్ట సర్దుకొని రోజు దగ్గరలోనే ఉంది కాబట్టి వెంటనే కంపెనీని తొలగించి ప్రజల ప్రాణాలను ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కంపెనీ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఎమ్మెస్ అగర్వాల్ కంపెనీ యాజమాన్యం కంపెనీ నడవడానికి అడ్డదారులను తొక్కి డబ్బు బలంతో, అధికారులతో కుమ్మక్కై, పోలీస్ డిపార్ట్మెంట్ వారితో కుమ్మక్కై నీ కంపెనీ నుండి వెలువడే విషపూరితమైన కాలుష్యం ద్వారా ప్రజల ప్రాణాలు, ప్రజలను అనారోగ్యం పాలు చేసే హక్కు ఎవరిచ్చారని అగర్వాల్ కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు, నీ అగర్వాల్ కుటుంబం లాభాల కోసం ప్రజల ప్రాణాలు తీసి తరతరాలుగా మీరు బ్రతకాలి కానీ, మా పేద కుటుంబాల ప్రాణాలు పోయి ప్రజల అనారోగ్యం పాలై మా రెండు గ్రామాల కుటుంబాలు రోడ్లమీద పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు, నీ కుటుంబం లాగా మా కుటుంబాలు కావాలి నీ ప్రాణం లాగా మా ప్రాణం కాదని అగర్వాల్ కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు,

ప్రజల ప్రాణాలు పోతున్నాయని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని మెదక్ జిల్లా కలెక్టర్ గారిని కలిసి బాధలు విన్నవించి వినతి ఇచ్చి మా ప్రజల ప్రాణాలను ఆరోగ్యంగా కాపాడాలని జిల్లా కలెక్టర్ గారిని కోరడం జరిగింది అన్నారు. ప్రజా అభిప్రాయ సేకరణ అనేది కంపెనీలో కాకుండా గ్రామంలోని నడిబొడ్డున చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలకు సంబంధం లేకుండా, పార్టీలకు అతీతంగా అందరం కలిసికట్టుగా పోరాడి ఎంఎస్ అగర్వాల్ కంపెనీని మన ప్రాంతం నుండి పారదోలి మన ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు ఇండస్ట్రియల్ మినిస్టర్ బాబు మానవత్వంతో ఆలోచించి రంగాయపల్లి చెట్ల గౌరారం గ్రామ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే ప్రజలపై ప్రేమ ఉంటే గ్రామాలకు వచ్చి ఎంఎస్ అగర్వాల్ కంపెనీ నుండి వెలువడుతున్న విషపూరిత కాలుష్యం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు పడుతున్న గోసలను చూడాలన్నారు, నిరాహార దీక్ష చేస్తాను అంటే అనేక రకాల ఒత్తిళ్లు పెట్టారని, ఇబ్బందులకు గురి చేశారని, నన్ను ఏమి చేసినా ఎన్ని కేసులు పెట్టినా, నా ప్రాణాలు పణంగా పెట్టి అయినా సరే కంపెనీ తొలగించే వరకు పోరాటం ఆగదని నాకు రంగాయపల్లి మరియు చెట్ల గౌరారం గ్రామ ప్రజల ఆరోగ్యాలు ప్రాణాలు ఆత్మగౌరవం ముఖ్యమనీ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. వందల మంది పోలీసులను పెట్టి సహారా కాయడం దారుణం అన్నారు, మేము ఏమన్నా దొంగలమా, అవినీతిపరులమా, ఈ ప్రాంతం వాళ్ళం కామా అని ప్రశ్నించారు, మేము ఇక్కడి మట్టి బిడ్డలం అన్నారు,



# సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి కౌంటర్

- సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఫైర్
- రైతుల కోసం రక్తమిస్తామన్న జగదీశ్
- నీటి నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీత
- రాజకీయాలు మాని రైతులను ఆదుకోవాలని డిమాండ్



డిడి9 వార్త


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కోసం తాము ప్రాణాలను పణంగా పెట్టి పోరాటంలోకి వచ్చామని గుర్తుచేసిన ఆయన, తమ రక్తంతో పంటలు పండుతాయని ప్రజలు భావిస్తే రైతుల కోసం రక్తం ఇవ్వడానికి కేసీఆర్‌తో పాటు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్య మంత్రి కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. 'సూపర్ ఎల్ నినో' ప్రభావంతో కరువు వచ్చే ముప్పు ఉందని, నీటిని ఎత్తిపోయాలని తాము నెత్తీ నోరూ బాదుకుంటున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడినవన్నీ శుద్ధ అబద్ధాలని రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైపోయిందని జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయాలు పక్కనబెట్టి రైతులను ఆదుకోవాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద దాదాపు 10 టీఎంసీల నీరు వృధాగా పోతున్నా ప్రభుత్వం ఎందుకు ఎత్తిపోయడం లేదని ప్రశ్నించారు. గోదావరి ఉధృతికి భద్రాచలం కొట్టుకుపోతుందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, ఆయన మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు సిగ్గుతో తల దించుకుంటున్నారని మండిపడ్డారు. రైతుల పొలాలకు నీళ్లివ్వడం చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే విపక్షాలపై బురదజల్లుతోందని జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.

# ర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- క్షీరసాగర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం..
- ప్రతి అర్హుడికి ఇల్లు అందిసాం జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి

ములుగు జులై 12 (డిడి9 వార్త)

ములుగు మండలంలోని క్షీరసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గుడ్ల మమత భాస్కర్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే లక్ష్యంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాకారమవుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ గుప్తా, ఆర్‌జీపీఎస్ చైర్మన్ నర్సింహా రెడ్డి, ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు మహేందర్, శశికాంత్ రెడ్డి, శ్రీనివాస్, ములుగు



మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కొన్యాల బాలరెడ్డి, ఉపసర్పంచ్ పర్శరాం, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నల్ల వినోద్, యూత్ ప్రెసిడెంట్ బలింపురం నవీన్, యూత్ వైస్ ప్రెసిడెంట్ బొగ్గుల శ్రీకాంత్,అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పరుశురాం, వార్డు సభ్యుడు సత్యనారాయణ, కొన్యాల విన్వేష్ రెడ్డి, సల్మాన్, ఆదాసు నర్సింలు, బొగ్గుల రవితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణకు 'రక్తకన్నీరు2' చూపిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్

డిడి9 వార్త



'తెలంగాణ ప్రజలకు రెండు పార్టీల నేతలు రక్తకన్నీరు సినిమా చూపిస్తున్నారు. కాంగ్రెస్ డైరెక్షన్..బీఆర్ఎస్ యాక్షన్ మూవీ రక్తకన్నీరు2 ను తలపిస్తోంది. 'రక్త కన్నీరు' నాగభూషణంను మించి నటనలో జీవిస్తున్నారు' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ కాళేశ్వరాన్ని కూల్చి రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీళ్ల పాల్జేసిందన్నారు. ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కార్ కాళేశ్వరాన్ని కోమాలోకి నెట్టిందన్నారు. ఈ రెండు పార్టీల పాపాలకు తెలంగాణ రైతులే బలవుతున్నారని, కాంగ్రెస్ చేతకానితనాన్ని ఎన్డీఎస్ఏపై నెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇకనైనా మానుకోవాలని హితవుపలికారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్2021 ప్రకారం...బ్యారేజీల యజమాని తెలంగాణ ప్రభుత్వమేనని తెలిపారు. ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ కమిటీలు సలహాలు మాత్రమే ఇస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. బ్యారేజీ మరమ్మతు పనులు చేయాల్సింది.. బాధ్యత వహించాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు.

**కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే నివేదిక**

కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే 3 సార్లు నివేదిక ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని పదే పదే చెప్పినా ఎందుకు పెడచెవిన పెడుతున్నారు? అని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ చేతగానితనాన్ని కేంద్రంపై నెట్టడం అలవాటుగా మారిందన్నారు. 'కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బాధ్యులను జైల్లో వేస్తామని గతంలో ప్రకటించింది కాంగ్రెస్సే. అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరపకుండా రూ.9 వేల కోట్ల అవినీతిపై విచారణకే పరిమితమైంది నిజం కాదా? ఆ కేసులో సూత్రధారులను అరెస్ట్ చేసి జైల్లో వేయకుండా సీబీఐ దర్యాప్తు చేయాలంటూ కేంద్రంపై రుద్ది తప్పుకున్నది నిజం కాదా? కాళేశ్వరంపై విజిలెన్స్ నివేదిక ఇస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అసలు విజిలెన్స్ నివేదికను బయట పెట్టే దమ్ముందా? బీఆర్ఎస్ పాపాలను రేవంత్ రెడ్డి మోయడం వెనుక మతలబు ఏమిటి? తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.. అని నిలదీశారు.

**రెండున్నరేళ్లు జాప్యం చేసింది మీరు కదా?**

కాళేశ్వరం మరమ్మతుల విషయంలోనూ రెండున్నరేళ్లు జాప్యం చేసింది మీరు కదా? ప్రజల నుంచి ఒత్తిడి వస్తుంటే చర్చను దారి మళ్లించేందుకు ఎన్డీఎస్ఏ కు అప్పగిస్తామంటూ కేంద్రంపై నెట్టాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి, నిర్లక్ష్యం, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల గోదావరి జలాలను తెలంగాణ ప్రజలు వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రాజకీయ డ్రామాలు పక్కనపెట్టండి.. ఎన్డీఎస్ఏ సిఫార్సులను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణను వేగవంతం చేయండి లేనిపక్షంలో తెలంగాణ రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ బలికాక తప్పదు' అని కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్ అయ్యారు.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేకంగా జూలై26 న జరిగే సదస్సును జయప్రదం చేయండి

జవహర్ నగర్, జూలై 12, (డిడి9 వార్త):

పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత, జీవించే హక్కును కల్పించి రాంకీ చెత్త డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాచైతన్య పాదయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథితిగా విచ్చేసిన పిఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య డిమాండ్ చేశారు.

సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ మరియు పోరాటకమిటీ కో కన్వీనర్ అనురాధ అధ్యక్షతన ఆదివారం రోజు, కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, గిరిప్రసాద్ నగర్, గబ్బిలాలపేటలో పాదయాత్రలు జరిగాయి. రాంకీ చెత్త డంపింగ్ యార్డు నుండి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ జూలై26 న శాస్త్రవేత్తలతో జరిగే బారీ ప్రజా అవగాహన సదస్సును జయప్రదం చేయాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటికి మద్దతుగా సామాజిక కార్యకర్త అంబికా, పిఓడబ్ల్యూ డి.స్వరూప, అనసూయ, సరిత, సిఎంఎస్ జ్యోతి, శ్రీదేవి, ఇఫ్టూ అరుణక్క ప్రజలకు పిలుపునిచ్చారు. శాంతినగర్, వైయస్ఆర్ నగర్, కార్మిక నగర్, గబ్బిలాల పేట, ఈస్ట్ నందమూరి నగర్, గిరిప్రసాద్ నగర్, చెన్నాపూర్, దేవేందర్ నగర్, వడ్డెర బస్తీ లాంటి తదితర సుమారు 100 బస్తీల ప్రజలు నిత్యం అనారోగ్యాల బారిన పడి, ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా కుంగిపోతున్నారని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా ప్రజలకు డంపింగ్ యార్డును ఎత్తివేస్తామని అంటున్నారేగానీ ఆచరణలో శూన్యమని పేర్కొన్నారు. ఇప్పటికైన కొట్లాడి తెచ్చిన తెలంగాణలో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ఎన్నికలకు ముందు ఆతర్వాత డంపింగ్ యార్డు బాదిత ప్రాంతాల నాలుగు మండలాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కమిటీ చైర్మన్ షేక్ షావలి, కో కన్వీనర్స్, మాజీ ప్రజాప్రతినిధులు టిఆర్ఎస్ (జాగృతి) మేక లలిత యాదవ్, శాంతినగర్ ఎ.సుబ్రమణ్యం, ఉపసర్పంచ్, కమిటి గౌరవ సలహదారుడు నర్సింహ్మా గౌడ్(కాంగ్రెస్), బీఆర్ఎస్ కొండల్ ముదిరాజ్, (సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్) గడ్డం సదానందం, తోటపల్లి శంకర్(సిపిఐ), శివన్నారాయణ(సిపిఎం) డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు కాల పరిమితి ముగిసిన కూడ మూసివేయకుండా, మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మరో రెండు కార్పొరేషన్ల చెత్తను జవహర్ నగర్ కు తరలించడం దుర్మార్గం, అమానుషం అని జయక్క, అల్లూరి సావిత్రి (సిఎంఎస్), పెర్క సునీత (పిఓడబ్ల్యూ (విముక్తి)), పిఓడబ్ల్యూ లక్షబాయ్, వి.జయసుధ (పిఓడబ్ల్యూ), ఎత్తిచూపారు. గాలీ, నీరు, నేలను విషతుల్యంగా మార్చి, పిల్లలను, వృద్ధులను రోగాల పాలు చేయడమేగాక, స్త్రీలకు గర్భాస్త్రావాలు, రక్తహీనత, క్యాన్సర్ తదితర మానసిక, శారీరక బాదలకు గురౌతున్నారని వై.మల్లేష్ (ఏ.ఐ.ఎఫ్.టి.యు.), వి.ప్రవీణ్(టియుసిఐ), పిడిఎం చంద్రమౌళి గుర్తుచేశారు. ప్రజలు అనుభవిస్తున్న బాధలను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం సమస్య తీవ్రతను గమనించి, తక్షణమే డంపింగ్ యార్డు విషయంలో నిర్ణయాత్మకమైన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డి.జాన్(పికెఎం), సూర వెంకటయ్య(బి.ఎన్.ఆర్.కె.ఎస్), టి.కాలేషా(ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ), ఏ.ఐ.టి.యు.సి. అంబాల ఎల్లయ్య, ఇఫ్టూ ఎం.సురేందర్, ఎండి.జావేద్(బహుజన రక్షణ సమితిబీఆర్ఎస్), మబ్బుబాలు(టివిఐవి), జర్నలిస్ట్ కొన్నె వేణు, స్వప్న, సుదీన, స్వరూప, సూచించారు. అందులో బాగంగానే కీసర, శామీర్ పేట, ఘట్ కేసర్, యాప్రాల్ కంటోన్మెంట్, కాప్రా మండలాల్లో జూలై1 నుండి 20 వరకు డంపింగ్ యార్డు యొక్క ప్రమాద తీవ్రతను తెలియజేస్తూ చైతన్య కార్యక్రమాలు చేపట్టామని తెలియజేస్తూ, ఈ లోపల ప్రభుత్వ పెద్దల నుండి స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనియెడల భవిష్యత్తులో జరిగే ప్రజా ఆందోళనకు ప్రభుత్వమే నైతిక భాధ్యత వహించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.




# కాంగ్రెస్ పార్టీ పీసీసీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి .....

- అధిష్టానాన్ని ధిక్కరించవద్దు...
- మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి

తూప్రాన్ జులై 12 డిడి9 వార్త

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిసిసి అధిష్టానాన్ని ధిక్కరించవద్దని అధిష్టానం తీర్మానించిన మండల కమిటీ మున్సిపల్ కమిటీ యే చెల్లుబాటు జరుగుతుంది అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిటుకుల మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తూప్రాన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయించిన కమిటీని వ్యతిరేకించోద్దని అధిష్టాన పిసిసికి వ్యతిరేకంగా గజ్వేల్ కాంగ్రెస్ ఇంచార్జి నర్సారెడ్డి కమిటీలు వేయడం ఎంతవరకు సమంజసం అనిఆయన అన్నారు తూప్రాన్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా గరిగే నర్సింగ్ రావు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా నాగులపల్లి శ్రీనివాస్ రెడ్డి లను పీసీసీ అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు మనోహరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా కళ్ళకల్ మల్లా రెడ్డి ని నియమించారు గజ్వెల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నర్సారెడ్డి పీసీసీ ఇచ్చిన మండల మున్సిపల్ కమిటీలకు వ్యతిరేకంగా కొత్త కమిటీ లు ఏర్పాటు చేయడం విడ్డురంగా ఉందని ఆయన దుయబ్బాటారు నర్సారెడ్డి కి కూడా పీసీసీ మహేష్ కుమార్ ఆదేశాల తోనే ఇంచార్జి ఇచ్చారాని వాళ్ల కూతురుకు పదవి ఎవరిచ్చారు అని ఆయన ప్రశ్నిచ్చారు నర్సారెడ్డి పై అధిష్టానం కు పిర్యాదు చేస్తాం అని చర్యలు తీసుకోకుంటే 10 వేల మంది తో గాంధీ భవన్ కు వెళ్లి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ మూతపడే వరకు ప్రజాపక్షాన ఉండి పోరాటం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఉమన్న గారి భాస్కర్ రెడ్డి, నాగులపల్లి శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి బజారు విశ్వరాజ్,నాగరాజు గౌడ్ గరిగే నర్సింగరావు అనిల్ కుమార్, డాక్టర్ అప్పర్,బుడ్డ భాగ్యరాజ్ లద్దిపీర్ల శ్రీనివాస్ గౌడ్, ఉమర్, హాజర్ గౌతమ్ గౌడ్ మహేందర్ అంకగారి శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఆస్కార్ విన్నర్ డైరెక్షన్‌లో
# దిశా పటానీ..



బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ గ్లామర్, యాక్షన్, డ్యాన్స్‌తో విపరీతమైన క్రేజ్‌ను రాబట్టుకున్నారు. ఇటీవల 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె భారీ విజయాన్ని అందుకున్నారు. దీంతో ఫుల్ జోష్‌లో ఉన్న దిశా హాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో రాబోతున్న 'హాలీగార్డ్స్ సాగా:ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' చిత్రంతో హాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ భారీ చిత్రంలో కెవిన్ స్పేసీతో పాటు డాల్ఫ్ లండ్‌గ్రెన్, టైరెస్ గిబ్సన్, బ్రియానా హిల్డెబ్రాండ్, ఎరిక్ రాబర్ట్స్ వంటి అంతర్జాతీయ నటీనటులు కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అతీంద్రియ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ మూవీని ఆస్కార్ విన్నర్ స్పేసీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దిశా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "హాలీవుడ్‌లో ఆడిషన్స్ ప్రక్రియ చాలా పక్కాగా, పద్ధతిగా ఉంటుంది. మనం ఏ ఏజెన్సీతో కాంట్రాక్ట్ సైన్ చేశాం అనేదానిపై కూడా మనకు వచ్చే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. అక్కడ ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను నిరూపించుకోవడం తప్పనిసరి.

ఇండస్ట్రీలో అదృష్టం కూడా ఒక ముఖ్యమైన అంశమే అయినప్పటికీ.. కేవలం పేరు, ఇమేజ్ ఉంటే సరిపోదు, అక్కడ అవకాశాలు రావు. ప్రతి నటుడు తన అసలు సామర్థ్యాన్ని ఆడిషన్‌ల ద్వారానే చూపించాల్సి ఉంటుంది. ఇండియాలో కూర్చుని హాలీవుడ్ అవకాశాలు దక్కించుకోవడం చాలా కష్టం. ఆన్‌లైన్‌లో ఆడిషన్‌లు ఇవ్వడం సాధ్యమే అయినప్పటికీ, కేవలం ఇక్కడే ఉండిపోకుండా అక్కడికి వెళ్లి, కొన్నాళ్లు ఉండి ప్రయత్నిస్తేనే ప్రత్యక్షంగా పాల్గొనే వీలుంటుంది. దీనివల్ల అవకాశాలు మరింత మెరుగ్గా వస్తాయి" అని చెప్పుకొచ్చారు. అలాగే ప్రతిరోజూ ఉదయాన్నే కెవిన్ స్పేసీ తమతో కూర్చుని ఆ రోజు తీయబోయే సీన్ గురించి పూర్తిగా వివరించేవారని దిశా గుర్తుచేసుకున్నారు. తన గత సినిమాల్లో ఏ దర్శకుడితోనూ తాను ఇలాంటి ప్రత్యేకమైన అనుభవాన్ని పొందలేదని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ పద్ధతి వల్ల పాత్రను మరింత బాధ్యతాయుతంగా అర్థం చేసుకుని నటించడానికి వీలైందని చెప్పారు.

సూపర్ స్టార్ కృష్ణ మనవడు.. మహేష్ బాబు అన్న కొడుకు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. 'శ్రీనివాస మంగాపురం'టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాను అజయ్ భూపతి తెరకెక్కిస్తున్నారు. కిరణ్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఇందులో సీనియర్ నటుడు మోహన్ బాబు ఒక పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. జయకృష్ణ సరసన బాలీవుడ్ స్టార్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే ఈ సినిమాతో ఆమె టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు.ఈ మూవీ జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతున్న నేపథ్యంలో, తాజాగా చిత్రయూనిట్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హీరోయిన్ రాషా తడాని సినిమా గురించి, తన పాత్ర గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తనకు ఈ కథలోని లవ్ అండ్ ఎమోషన్స్ చాలా బాగా నచ్చాయని, కథ వింటున్నప్పుడే ఆ ఎమోషన్‌కు తాను బాగా కనెక్ట్ అయ్యానని రాషా చెప్పారు. ఇదొక వండర్‌ఫుల్ స్టోరీ అని అన్నారు. ఈ సినిమాలో తాను మంగ అనే పాత్రలో కనిపిస్తానని, ఇందులో రెండు విభిన్నమైన కోణాలు ఉంటాయని వెల్లడించారు. ఒకవైపు ఎంతో తుంటరిగా, మరోవైపు చాలా పద్ధతిగా, హుందాగా తన పాత్ర కనిపిస్తుందని చెప్పారు.

తనకు తెలుగు స్పష్టంగా మాట్లాడటం రాకపోయినప్పటికీ, ఎదుటివారు చెబితే బాగా అర్థమవుతుందని అన్నారు. అందుకే దర్శకుడు అజయ్ భూపతి తనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రతి డైలాగ్, ఎమోషన్‌ను దగ్గరుండి నేర్పించారని గుర్తుచేసుకున్నారు. ఈ మంగ పాత్ర తన రియల్ లైఫ్‌కు చాలా దగ్గరగా ఉంటుందని ఆమె తెలిపారు. తన మొదటి తెలుగు సినిమా షూటింగ్ తిరుపతి లాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో జరగడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమా కోసం తనతో పాటు టీమ్ మొత్తం రాత్రింబవళ్లు చాలా కష్టపడ్డారని వెల్లడించారు. ఇక నిర్మాతల గురించి మాట్లాడుతూ.. అశ్విని దత్ గారు తన జీవితంలో కలిసిన బెస్ట్ పర్సన్స్‌లో ఒకరని రాషా ఎంతో ఎమోషనల్ అయ్యారు. ఆయన తనను సొంత మనవరాలిలా చూసుకున్నారని చెప్పారు. తన తాతగారితో అశ్విని దత్ గారికి మంచి పరిచయం ఉందని, అంత పెద్ద బ్లాక్‌బస్టర్ ప్రొడ్యూసర్ అయినప్పటికీ ఆయన ఎంతో వినయంగా, డౌన్ టు ఎర్త్ ఉంటారని ప్రశంసించారు. అలాగే సెట్స్‌లో సీనియర్ నటుడు మోహన్ బాబు గారికి ఉన్న అనుభవం నుంచి తాను ఎన్నో నటనకు సంబంధించిన విషయాలను నేర్చుకున్నట్లు రాషా తడాని చెప్పుకొచ్చారు



## ఈ పాత్ర నా రియల్ లైఫ్‌కి చాలా దగ్గరగా ఉంటుంది



## నా నటనను గుర్తుంచుకునేలా ఉండే కథలకే ప్రాధాన్యం ఇస్తా..

తన అద్భుతమైన ఎనర్జిటిక్ మాస్ స్టెప్పులతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సాధించి, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కొత్త ఊపు తీసుకొచ్చిన ఫేమస్ ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ. రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన నాగదుర్గ.. వెండి తెరపై కనిపించేందుకు సిద్ధమయ్యారు. బలగం ఫేమ్ ప్రియదర్శి హీరోగా నటిస్తున్న ఇడుపు కాయితం సినిమాతొ హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నారు. శ్రీలత అనే తెలంగాణ గ్రామీణ యువతి పాత్రలో కనిపించబోతున్నారు. అలాగే తమిళంలో 'లవ్ ఓ లవ్' చిత్రంతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. వరుసగా సినిమా అవకాశాలు వస్తుండటంతో, నాగదుర్గ ఇకపై ఫోక్ సాంగ్స్‌కు పూర్తిగా దూరం కాబోతున్నారని, కేవలం చిత్రాలపైనే దృష్టి పెట్టబోతున్నారనే పుకార్లు సోషల్ మీడియాలో జోరుగా షికారు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఫోక్ సాంగ్స్ మాత్రమే తన అసలైన గుర్తింపు అని నాగదుర్గ స్పష్టం చేశారు.

ఫోక్ సాంగ్స్ వల్లే తనకు ఈ రోజు ఇంతటి ఆదరణ, గుర్తింపు లభించాయని చెప్పారు. ఇక పాటలకు దూరం కావడం అనే వార్తలపై మాట్లాడుతూ.. తాను ఏదో ప్రమోషన్ల కోసం ఫోక్ సాంగ్స్ చేయడం లేదని అన్నారు. తాను ఇండస్ట్రీకి వచ్చిన దారి అదేనని, ఈ స్థాయికి తీసుకొచ్చిన జానపద వేదికను తాను జీవితంలో మర్చిపోలేనని ఎమోషనల్ అయ్యారు. అందుకే హీరోయిన్ అయినప్పటికీ, భవిష్యత్తులో అవకాశం దొరికినప్పుడల్లా మంచి ఫోక్ సాంగ్స్ చేస్తూనే ఉంటానని క్లారిటీ ఇచ్చారు. అలాగే సినిమాల్లో తన పాత్రల ఎంపిక గురించి కూడా నాగదుర్గ సంచలన వ్యాఖ్యలు చేశారు. మూవీస్‌లో కేవలం పాటల కోసం మాత్రమే తనను హీరోయిన్‌గా పెట్టి, డ్యాన్స్ చేయించి పంపించేసే గ్లామర్ పాత్రలు తాను చేయనని, అలాంటివి తనకు అస్సలు నచ్చవని తేల్చి చెప్పారు. కథలో హీరోయిన్ పాత్రకు బలమైన ప్రాధాన్యత ఉండాలని, ఒక నటిగా తనలోని నటనను, ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉన్న పాత్రలనే ఎంచుకుంటానని అన్నారు. థియేటర్ల నుంచి బయటకు వచ్చాక కూడా ప్రేక్షకులు తన నటనను గుర్తుంచుకునేలా ఉండే కథలకే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని నాగదుర్గ స్పష్టం చేశారు.

## 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్ లాంచ్‌కు రంగం సిద్ధం




మలయాళ స్టార్ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. ఎస్.ఎస్. రాజమౌళి సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రోజురోజుకూ పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. జూలై 13న హైదరాబాద్‌లోని ఆర్కే సినీమాక్స్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు చిత్ర బృందం పోస్టర్ ద్వారా వెల్లడించింది. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఈ చిత్రానికి శశాంక్ యేలేటి కథ, దర్శకత్వం వహించగా, శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. కాల భైరవ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. టీజర్ లాంచ్ ఈవెంట్‌కు అభిమానులు ఉచితంగా హాజరయ్యేలా YouWeMedia.com ద్వారా ఫ్రీ పాస్‌లు అందుబాటులో ఉంచినట్లు మేకర్స్ వెల్లడించారు. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్ర టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 'రాకా'.. నాలుగు వేర్వేరు పాత్రల్లో అల్లు అర్జున్?

అగ్ర నటుడు అల్లు అర్జున్ (Allu Arjun) హీరోగా, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'రాకా' (Raaka). ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న భారతీయ ప్రతిష్ఠాత్మకమైన చిత్రాల్లో ఇదీ ఒకటి. అయితే ఈ మూవీలో అల్లు అర్జున్ నాలుగు వేర్వేరు పాత్రలు పోషించనున్నట్లు సమాచారం. తాత, తండ్రి, ఇద్దరు కొడుకులుగా కనిపించనున్నారని టాక్. ఒకవేళ అదే నిజమైతే ఇది ఆయన సినీ కెరీర్‌లోనే ఫస్ట్ మల్టిపుల్ రోల్ సినిమాగా నిలుస్తుంది. ఈ మూవీలో మొదట అట్లీ డబుల్ రోల్ ప్లాన్ చేశారట. తండ్రి, తాత పాత్రలకు వేరే నటులను తీసుకోవాలనుకున్నారు. కానీ, అల్లు అర్జున్ నాలుగు పాత్రలను తానే చేస్తానని అన్నారట. మొదట్లో అట్లీకి సందేహం ఉన్నా, లుక్ టెస్ట్ తర్వాత ఇదే సినిమాకు ప్లస్ అవుతుందని భావించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ మూవీలో దీపికా పదుకొణె కథానాయిక. గ్లోబల్ స్థాయిలో ఎప్పుడూ చూడని విజువల్స్ ఇందులో ఉంటాయని అట్లీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ముంబైలో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. 2027లో ఈ భారీ ప్రాజెక్ట్ ప్రపంచవ్యాప్తంగా పలు థియేటర్లలో విడుదల కానుంది.



## నా ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరు

**తన ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరని నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. తాను మౌనంగా లేనని అన్నీ చూస్తున్నానని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి ఇన్ఫ్లుయెన్స్ తో జనసైనికులు, కొందరికి అమ్ముడుపోయిన జనసైనికులు యూట్యూబర్లు చేస్తున్న అసత్యప్రచారాలు వింటున్నానని అన్నారు. మీ అందరికీ నా సమాధానం ఇదేనని.. దిగజారండి.. ఇంకా దిగజారండి అంటూ ఎద్దేవా చేశారు. ప్రపంచం మొత్తం చూస్తుందని, దిగజారడంలో మీకు మీరే సాటి అని చెప్పేలా దిగజారండి అంటూ మండిపడ్డారు.**

**కాస్త గట్టిగా దిగజరండి.. అరుస్తూ దిగజారండి అంటూ మండిపడ్డారు. మీరు ఎంత అరిచినా ఎన్ని కథలు చెప్పినా తన లాంటి ప్రశ్నించే గొంతులను ఆపలేచని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ప్రకాష్ రాజ్ గతకొద్దిరోజులుగా వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. ప్రశ్న రావణ్ ను పోలీసులు అరెస్ట్ చేసిన నాటి నుండి ప్రకాష్ రాజ్ ఆయనకు మద్దతుగా నిలుస్తూ వీడియోలు చేస్తున్నారు. రావణ్‌ను అక్రమ అరెస్ట్ చేశారంటూ ప్రకాష్ రాజ్ ఆరోపిస్తున్నారు. దీంతో ప్రకాష్ రాజ్ పై సైతం కొందరు విమర్శలు చేస్తూ వీడియోలు చేస్తున్నారు.**



## ఆ గాయం వల్ల యాక్షన్ సీన్స్‌కు
# దూరంగా ఉండాల్సి వస్తుంది



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఇటీవల నటించి 'ఐ, నోబడీ' సినిమాతో ప్రేక్షకులను మెప్పించారు. ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొంటూ ఫుల్ బిజీగా గడుపుతున్నారు. మహేష్ బాబు హీరోగా వస్తున్న ఈ చిత్రాన్ని రాజమౌళి తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పృథ్వీరాజ్ సుకుమారన్ తన జీవితంలో జరిగిన ఓ చేదు సంఘటనను గుర్తు చేసుకుని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. 2023లో జరిగిన ఒక సినిమా షూటింగ్‌లో తనకు తీవ్ర గాయమైందని, ప్రస్తుతం తన ఎడమ కాలిలో మూడు టైటానియం స్క్రూలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. మనం చేసే ఒక చిన్న పొరపాటు లేదా ప్రమాదం కేవలం మనల్ని మాత్రమే కాదు, ఒక సినిమా నిర్మాణాన్ని నమ్ముకున్న వందలాది కుటుంబాలను ఎలా రోడ్డున పడేస్తుందో ఆ సంఘటన తనకు నేర్పిందని ఆయన అన్నారు.

సాధారణంగా సినిమాల్లో డూప్ లేకుండా సొంతంగా యాక్షన్ సీన్స్ చేయడానికి పేరుగాంచిన పృథ్వీరాజ్, ఇప్పుడు మాత్రం హైరిస్క్ స్టంట్స్ చేసే విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నట్లు చెప్పారు. అలాగే 'ఐ, నోబడీ' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన మరొక ప్రమాదాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. షూటింగ్ చేస్తుండగా ఒక ఫైటర్ తలకు తీవ్ర గాయమైందని, మెడ వెనుక భాగంలో ఏకంగా 37 కుట్లు పడ్డాయని చెప్పారు. ఒకవేళ ఆ షాట్ తాను చేసి ఉంటే, మరో ఆరు నెలల పాటు ఇంట్లోనే కూర్చోవాల్సి వచ్చేదని, యాక్షన్ సినిమాల్లో ఎంత రిస్క్ ఉంటుందో చెప్పడానికి ఇదే ఉదాహరణని అన్నారు. అయినప్పటికీ తనకు యాక్షన్ సీన్స్ చేయడం ఇష్టమని.. కానీ తన గాయాల వల్ల దూరంగా ఉండాల్సి వస్తుందని చెప్పుకొచ్చారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.